సాక్షి బాపట్ల

శనివారం । 29 । ఏప్రిల్ । 2023

I



ధ్యానబుద్ధను సందర్శించిన మంత్రి సీదిరి

అమరావతి: ధ్యానబుద్ధ ప్రాజెక్టును పశుగణాభివృద్ధిశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం సందర్శించారు. ఆయన వెంట ఓఎస్‌డీ యుగంధర్ ఉన్నారు.




నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: స్థానిక మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1.500, గరిష్ట ధర రూ.3.500, మోడల్ ధర రూ.2.200 వరకు పలికింది.

కరోనా - జీరో

గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కరోనా పాజిటివ్ కేసులు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.



న్యూస్‌రీల్

జిల్లాలో ఇద్దరు సీఐలు బదిలీ

బాపట్లటౌన్: జిల్లాలోని అద్దంకి నియోజకవర్గంలో ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ రేంజ్ ఐజీ కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అద్దంకి నియోజకవర్గంలోని సంతమాగులూరు సర్కిల్ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.లక్ష్మణ్‌ను గుంటూరు రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న బి. ప్రభాకర్‌ను సంతమాగులూరు సీఐగా నియమించారు. నెలరోజులుగా ఇన్‌ఛార్జి పాలనలో ఉన్న అద్దంకి రూరల్ సర్కిల్‌కు సత్తెనపల్లి సీఐగా విధులు నిర్వర్తిస్తున్న ఆర్. ఉమేష్‌ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లా మైనింగ్ అధికారిగా రాజేష్ కుమార్

సాక్షి ప్రతినిధి, బాపట్ల బాపట్ల జిల్లా మైనింగ్ అధికారిగా ఆర్.రాజేష్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. వైఎస్సార్ జిల్లా, యర్రగుంట్ల మైనింగ్ ఏడీగా పనిచేస్తున్న ఈయనను బాపట్ల జిల్లా మైనింగ్ అధికారిగా బదిలీ చేశారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు కొత్తగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో మైనింగ్ అధికారి లేరు. ఉమ్మడి గుంటూరు జిల్లా అధికారులే ఆ శాఖను పర్యవేక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం బాపట్ల జిల్లాకు జిల్లా మైనింగ్ అధికారిని నియమించింది. మే 1 నుంచి బాపట్ల జిల్లాలో మైనింగ్ కార్యాకలాపాలు ప్రారంభం కానున్నాయి. ఇక్కడి నుంచే అధికారులు ప్రారంభిస్తారు.

కార్యదర్శి సస్పెన్షన్

దాచేపల్లి: మండలంలోని శ్రీనగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న పప్పుల విజయ్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ లోతేటి శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో గామాలపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విజయ్‌కుమార్ విధులు నిర్వహించిన సమయంలో వచ్చిన ఆరోపణలపై ఈవోపీఆర్డీ కొల్లి రాధమాదవీ విచారణ ఈవోపీఆర్డీ రూ.25.22 లక్షల నిధులను దుర్వినియోగం చేసినట్లు విచారణలో వెల్లడి కావడంతో కలెక్టర్ సస్పెండ్ చేశారు.

స్మార్ట్‌గా.. పిచికారీ

- పురుగుమందుల పిచికారీకి స్మార్ట్ స్ప్రేయర్
- ఆధునికతను రైతులకు అందిస్తున్న బాపట్ల వ్యవసాయ శాస్త్రవేత్తలు
- త్వరలో రైతులకు అందుబాటులోకి..



పొలంలో స్ప్రేయర్ పనిచేస్తున్న విధానం

బాపట్ల: రోజురోజుకీ పెరుగుతున్న కూలీల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కూలీలతో పనిలేకుండా రైతులను యాంత్రీకరణ వైపు తీసుకొచ్చేందుకు బాపట్ల వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల శాస్త్రవేత్తలు చేస్తున్న ప్రయోగాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఇందులో భాగంగా నాడు హలంపట్టి.. పొలం దున్నే అన్నదాతలు ఎంచక్కా... ఇప్పుడు ట్రాక్టర్లపై సవారీ చేస్తున్నారు. నడుములు విరిగేలా నాట్లు వేసే మహిళలు వెద పద్ధతిని అందిపుచ్చుకున్నారు. హార్వెస్టింగ్ మిషన్ల రాకతో వరికోతలకు స్వస్తి చెప్పారు. తాజాగా భుజాలపై పురుగు మందుల స్ప్రేయర్ల బరువు ఎత్తుకొని పొలం అంతా కలియ తిరిగే రైతన్నలు గడ్డుపై కూర్చొని స్మార్ట్ స్ప్రేయర్ సూపర్ యంత్రంతో పురుగు మందులు పిచికారీ చేసేయవచ్చు.

నూతన యంత్రం సృష్టి

ప్రస్తుతం వ్యవసాయ రంగంలో పురుగుమందుల వినియోగం బాగా పెరిగింది. మందుల కొనుగోలుతోపాటు పిచికారీ చేయించేందుకు కూలీలకు అధిక ధరలు వెచ్చించాల్సి వస్తుంది. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బాపట్ల వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు పొలంపై పురుగు మందులను పిచికారీ చేసేందుకు 'స్మార్ట్ స్ప్రేయర్ సూపర్ యంత్రాన్ని' సృష్టించారు.

పనిచేసే విధానం ఇలా..

మొక్కలను గుర్తించేందుకు, వెంటనే వాటిపై రసాయనాలు చల్లేందుకు అనువైన రియల్ టైమ్ ప్లాంట్ డిటెక్షన్ ఎలక్ట్రానిక్ కంట్రోల్ యూనిట్ (ఈసీయూ) అభివృద్ధి చేశారు. ఈ యంత్రం ప్రధానంగా అల్ట్రాసోనిక్ సెన్సార్ ద్వారా మొక్కలను గుర్తిస్తోంది. మొక్క సంకేతాల ఆధారంగా సోలేనోయిడ్ వాల్వ్‌లను తెరవడానికి, మూయడానికి అనువుగా మైక్రో కంట్రోలర్ యూనిట్ పని చేస్తుంది. ఈ యంత్రంలో 24 వాల్ట్స్ సామర్థ్యం కలిగిన మూడు బ్యాటరీలను అమర్చారు. వాటిల్లో రెండు బ్యాటరీలు యంత్రం పని చేయటానికి, మరొక బ్యాటరీపై మొక్కలపై పురుగు మందులను పిచికారీ చేసేందుకు ఉపయోగపడుతుంది. ఈ స్మార్ట్ స్ప్రేయర్‌ను ఇప్పటి వరకు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వివిధ కార్యక్రమాలలో ప్రదర్శించారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఎస్.విష్ణువర్ధన్ రెడ్డి స్మార్ట్ స్ప్రేయర్‌ను పరిశీలించి రైతులకు వేర్వేరు ప్రదేశాల్లో ఈ యంత్రం పనితనాన్ని వివరించి అవగాహన కల్పించాలని సూచించారు.

రైతులకు బహుళ ప్రయోజనాలు



"స్మార్ట్‌స్ప్రేయర్ సూపర్ యంత్రం వల్ల రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయి. పురుగు మందు వృథా కాకుండా పైరుపై చల్లుకునే అవకాశం ఉంటుంది. మొక్క మొదలు నుంచి చివరి భాగం వరకు పురుగులు ఎక్కడున్నా నాశనం చేయటం జరుగుతుంది. పొలం సాళ్లల్లో తిరుగుతూ పైరు మొత్తాన్ని సమానంగా పురుగు మందులు పిచికారీ చేయటం జరుగుతుంది.

–డాక్టర్ అశోక్ కుమార్, శాస్త్రవేత్త, వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల, బాపట్ల

ప్రయోజనాలు ఇలా...

- ఈ యంత్రాన్ని ఉపయోగించడం వల్ల రైతుల భుజాలపై 20 లీటర్ల బరువు కలిగిన స్ప్రేయర్లను ఎత్తుకొని పొలం చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు.
- గట్టుపై నిలబడి పొలం అంతా పురుగుమందు తడిచేలా ఆపరేట్ చేసుకోవచ్చు.
- దీనివల్ల మందులు వృథా కాకుండా తెగులు సోకిన మొక్కలపై మాత్రమే పడేటట్లు చూసుకోవచ్చు.
- పై నుంచి మందును పిచికారీ చేయటం వల్ల మొక్క మొత్తం పూర్తిగా మందుతో తడుస్తుంది.
- దీంతో మొక్క పై భాగం నుంచి కాండం వరకు ఏ భాగంలో ఉన్న పురుగులు అయినా చనిపోయే అవకాశం ఉంటుంది.
- యంత్రం పొలంలో దిగబడకుండా ఉండేందుకు, ఎత్తుపల్లాలకు దాటేందుకు వీలుగా నాలుగు 5.8 పరిమాణం గల న్యూమాటిక్ టైర్లను వాడారు.
- ఈ నాలుగు టైర్లను చైన్‌స్ప్రాకెట్ ద్వారా జత చేశారు.
- పొలంలో ఇవి ఒకేసారి.. ఒకేమాదిరిగా ముందుకి, వెనుకకు కదులుతాయి.
- పొలంలో ఈ స్ప్రేయర్ వాడినప్పుడు బ్యాటరీలు డిశ్చార్జ్ కాకుండా ఉండేందుకు 0.5 హెచ్‌పీ డీజిల్ ఇంజన్‌ను ఆల్టర్నేట్‌గా అనుసంధానం చేశారు.

తాగునీటి ఎద్దడి రానివ్వద్దు

- కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశం
- ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష



బాపట్ల: వేసవిలో జిల్లా ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా యంత్రాంగాన్ని ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ రాజ్ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులపై సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో శుక్రవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో ఆయన సమీక్షించారు. ఇంజినీరింగ్ అధికారులు పది రోజులపాటు అన్ని గ్రామాలలో పర్యటించి త్రాగునీటి సమస్యలు గుర్తించి తక్షణమే పరిష్కార మార్గం చూపాలని కలెక్టర్ తెలిపారు. పైపులైను లీకేజీలు, అందుబాటులో లేని నీటి వనరుల సమస్యలన్నింటినీ గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు ఉండరాదని, నీటి ఎద్దడి రాకుండా జాగ్రత్త పడాలన్నారు.

జలజీవన్ మిషన్ కింద ప్రభుత్వం మంజూరు చేసిన పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. జిల్లాకు 723 పనులు మంజూరు కాగా పూర్తిస్థాయిలో ప్రారంభం కాకపోవడంపై మండలాల వారీగా సమీక్షించారు. మండలస్థాయి అధికారులు 10 రోజులకు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా పని చేయాలని మార్గ నిర్దేశం చేశారు. నిర్లిప్తంగా విధులు నిర్వహిస్తే సహించేది లేదన్నారు. జె.పంగులూరు మండలంలో 13 పనులు పెండింగ్‌లో ఉండగా, కొరిశపాడులో 17, సంతమాగులూరులో 10, బాపట్లలో 22, కర్లపాలెంలో 18, చీరాలలో 36, చినగంజాంలో 32, ఇంకొల్లులో 14, మార్టూరులో 19, నగరంలో 46 పనులు పెండింగ్ ఉండడంపై ఆరాతీశారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సామాజిక మరుగుదొడ్ల భవన నిర్మాణాలు జిల్లాకు 406 మంజూరు కాగా 48 పనులు ప్రారంభం కాకపోవడంపై అధికారులను నిలదీశారు. 41 పనులు పునాది స్థాయికి దిగువన ఉండటం ఏమిటని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులు వేగంగా చేపట్టాలన్నారు.

జగనన్న లే అవుట్లలో...

జగనన్న లేఅవుట్లలలో భూమి చదును చేసే పనులు అత్యంత వేగంగా పూర్తిచేయాలని కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశించారు. భూమి చదును చేయకుండా గృహ నిర్మాణాలలో పురోగతి ఎలా ఉంటుందని అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రాధాన్యతను గుర్తించి అధికారులు పనిచేయాలన్నారు. అమర్తలూరు మండలంలో 37 పనులు మంజూరుకాగా, 31 పనులు ప్రారంభం కాకపోవడంపై పి.ఆర్. ఇంజినీర్స్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల మంజూరు, టెండరు దశలో ఉన్నవి, ప్రారంభమైన పనుల వివరాలు సంబంధిత ఏ.ఇ. చెప్పలేకపోవడంపై కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. రెండేళ్లుగా పనిచేయకుండా, పురోగతి లేకుండా ఏం చేస్తున్నారంటూ మండిపడ్డారు. భట్టిప్రోలులో 42 పనులు మంజూరైనప్పటికీ పురోగతి లేకపోవడం, కొల్లూరులో 12 పెండింగ్‌లో ఉండగా, చుండూరులో 25 పనులు పెండింగ్‌లో ఉండడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. గడపగడపకు మనప్రభుత్వం పనులు 100 పెండింగ్లో ఉండడంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ సచివాలయాలు, ఆర్.బి.కె.లు., వై.ఎస్.ఆర్. హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణ పనులలో పురోగతి లేకపోతే సహించేది లేదని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈ పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు.

ఇలాంటి పనులపై అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. భవన నిర్మాణాలకు రెండేళ్ల క్రితం ఉపాధిహామి పథకం కింద నిధులు కేటాయిస్తూ అధికారికంగా మంజూరు చేసినప్పటికి పురోగతి ఎందుకు లేదని నిలదీశారు. పి.ఆర్. ఇంజినీర్లు తమ విధులు నిర్వహించుకుండా ఏం పనిచేస్తున్నారని తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. కొల్లూరు మండలంలో ఆరు సచివాలయ భవనాలు, రెండు రైతుభరోసా కేంద్రాల భవనాల నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంపై మండిపడ్డారు. తదుపరి సమావేశం నాటికి ప్రారంభం కాని భవనాలు జిల్లాలో ఉండరాదని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆర్.డబ్ల్యు.ఎస్. ఇన్‌చార్జీ ఎస్.ఇ. విజయకుమార్, పి.ఆర్. ఎస్.ఇ. శ్రీనివాసులు, డ్వామా పి.డి.శంకరనాయక్, ఇంజినీర్లు, డి.ఇ.లు, పాల్గొన్నారు.

స్కేటింగ్ యువ కెరటం

- రోలర్ స్కేటింగ్‌లో గ్రామీణ యువకుడి సత్తా
- రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రెండు బంగారు పతకాలు కైవసం
- ఔత్సాహిక యువకులకు శిక్షణ


శిక్షణ పొందుతున్న చిన్నారులు

అద్దంకి: చిన్న వయసులోనే తాను నేర్చుకున్న విద్యను నలుగురికి పంచాలన్న తాపత్రయం ఆ యువకుడిది. కేవలం చదువుల్లోనే కాదు ఆటల్లోనూ మంచి భవిష్యత్ ఉంటుందని చాటి చెబుతున్నాడు. చిన్నవయసులోనే స్కేటింగ్‌లో రాణిస్తూ శిష్యులనూ తయారు చేస్తున్నాడు బాపట్ల జిల్లా అద్దంకి మండలం తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన జ్యోతి హరికృష్ణ. ఇతను రోలర్ స్కేటింగ్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించాడు. ఆ విద్యను తనతోపాటు మరి కొందరికి నేర్పించాడు. వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్ధం చేస్తున్నాడు.

కుటుంబ నేపథ్యం, చదువు..

తిమ్మాయపాలెం ఎస్సీ కాలనీలోని జ్యోతి కోటేశ్వరరావు, రమాదేవిల కుమారుడు జ్యోతి హరికృష్ణ. 6వ తరగతి నుంచే తమ పీఈటీ సునీత ప్రోద్బలంతో ఆటలపై మక్కువ పెంచుకుని వాలీబాల్, కబడ్డీ, ఖోఖో జోనల్ స్థాయి పోటీల్లో ఆడాడు. తండ్రి వ్యవసాయం కూలిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోలర్ స్కేటింగ్‌పై ఆకర్షితుడైన హరికృష్ణ శిక్షణ పొందాడు. ఇంటర్ తరువాత పీఈటీ ట్రైనింగ్ చేశాడు. ప్రస్తుతం ప్రొద్దుటూరులోని కళాశాలలో బీపీఈడీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఒకటి నుంచి పదో తరగతి వరకు స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివాడు.

ఇప్పటివరకు హరికృష్ణ విజయాలివీ..

- 2019లో ప్రకాశం జిల్లా రోలర్ స్కేటింగ్ పోటీల్లో ప్రథమ స్థానం.
- విశాఖపట్నంలో నిర్వహించిన 31వ ఆంధ్రప్రదేశ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్‌లో ప్రథమ స్థానంతోపాటు రెండు గోల్డ్ మెడల్స్ సాధన.
- రాష్ట్రం తరపున 2019లో విశాఖపట్నంలో నిర్వహించిన 57వ జాతీయ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రాతినిధ్యం.
- 2023లో ఆంధ్రా యూనివర్సిటీ నిర్వహించిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో నాగార్జున యూనివర్సిటీ తరపున ప్రాతినిధ్యం.


బంగారు పతకం అందుకుంటున్న హరికృష్ణ (ఫైల్)

- హరికృష్ణ 2017లో మొదటిసారి సమ్మర్ కోచింగ్ క్యాంపు ఏర్పాటు చేశాడు. చాలా మందికి స్కేటింగ్‌లో శిక్షణ ఇచ్చాడు. తన వద్ద శిక్షణ పొందిన చిన్నారులు, యువకుల్లో 15 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు 2019, 2023 సంవత్సరాల్లో ఎంపికయ్యారు.

పీడీగా ఉద్యోగం సాధించాలని..

బీపీఈడీ చేసిన తరువాత పీడీ ఉద్యోగం సాధించాలన్నది లక్ష్యం. ప్రస్తుతం విద్యార్థులకు ఆటల్లో శిక్షణ ఇస్తున్నాను. స్కేటింగ్‌లో అంతర్జాతీయ స్థాయిలో దేశానికి పతకాలు తేవాలని ఉంది. యువత చదువుల్లోనే కాదు. ఆటల్లోనూ దేశానికి మంచి పేరు తీసుకురావచ్చు. తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉండాలి.
– జ్యోతి హరికృష్ణ

ఎందుకన్నా ఇలా..

అలకా.. అవమానమా..?!

- టీడీపీలో కన్నా లక్ష్మీనారాయణ పరిస్థితి దైన్యం
- ప్రచార రథం, బాబు వేదికలపై కనిపించని వైనం
- వరుసగా అవమానాలు
- రగిలిపోతున్న అనుచరులు

సత్తెనపల్లి: ఐదుగురు ముఖ్యమంత్రులతో కలిసి పని చేసి, మంత్రి పదవులు నిర్వహించి సీనియర్ నాయకుడిగా పేరొందిన మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ పరిస్థితి ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలో దయనీయంగా మారింది. టీడీపీలో ఆర్థికంగా, సామాజికంగా బలంగా ఎదిగిన నేతల మధ్య ఒక సాధారణ నాయకుడి స్థాయి కన్నా కిందకు దిగజారారని ఆయన అభిమానులు ఆవేదన చెందుతున్నారు. రాష్ట్రానికి ఇదేమి ఖర్మ అంటూ పల్నాడు జిల్లా పెదకూరపాడు నుంచి సత్తెనపల్లి నియోజకవర్గానికి బయలుదేరిన ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు పర్యటన ప్రచార రథంలో కన్నాకు సముచిత స్థానం, గౌరవం లభించలేదు. సత్తెనపల్లి పట్టణంలోని వెంకటేశ్వర గ్రాండ్‌లో నిర్వహించిన బీసీల ఆత్మీయ సమీక్ష- సమావేశాల్లోనూ వేదికపై కన్నా కనిపించలేదు. కావాలనే ఆయనను వేదికపైకి పిలవలేదని, చంద్రబాబూ పట్టించుకోవడం లేదని కన్నా వర్గీయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే తనకు జరుగుతున్న అవమానాలపై కినుక వహించే బీసీ ఆత్మీయ సమావేశంలో కన్నా వేదిక ముందు కూర్చున్నారనే చర్చ కూడా సాగుతోంది. మొత్తమ్మీద చంద్రబాబు పర్యటనలో ఒక్క పెదకూరపాడు నియోజకవర్గంలో తప్ప మరెక్కడా చంద్రబాబునాయుడు పక్కన కన్నా కనిపించలేదు. ఒకప్పుడు ఉమ్మడి గుంటూరు జిల్లాలో చక్రం తిప్పిన నాయకుడికి ఇదేమి ఖర్మ.. అంటూ నేతలు చర్చించుకోవడం గమనార్హం. ఈ విషయం సోషల్ మీడియాలో, వాట్సాప్ గ్రూపుల్లోనూ వైరల్‌గా మారడం గమనార్హం.


చంద్రబాబు పక్కన చేతులు కట్టుకుని నిలబడిన మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ

గ్రావెల్ తవ్వకాలకు పర్యావరణ అనుమతులపై మిశ్రమ స్పందన

మార్టూరు: గ్రావెల్ తవ్వకాల కోసం ఓ సంస్థ దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో అధికారులు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమైంది. మండలంలోని బొబ్బేపల్లి, రాజుగారిపాలెం గ్రామాల పరిధిలోని సర్వే నంబర్ 387/సీ11లో గ్రావెల్ తవ్వకాల కోసం ఐ ఫీచర్ లిమిటెడ్ అనే సంస్థ దరఖాస్తు చేసుకుంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ చామకూరి శ్రీధర్ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజలు సుమారు 70 మంది పాల్గొన్నారు. అధికారులు ప్రజల నుంచి చేతులెత్తి తమ అభిప్రాయం తెలపాలని కోరగా బొబ్బేపల్లి గ్రామానికి చెందిన మెజారిటీ వ్యక్తులు ప్రస్తుత సంస్థకు అనుమతులు ఇవ్వొద్దని, గతంలో ఇచ్చిన అనుమతులు కూడా రద్దు చేసి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. రాజుగారిపాలెం గ్రామానికి చెందిన వ్యక్తులు మాత్రం అభివృద్ధి కోసం, రోడ్డు కోసం గ్రావెల్ అవసరమే కనుక పర్యావరణ ఇబ్బందులు రాకుంటే తమకు ఎలాంటి ఇబ్బందీ లేదని తెలిపారు. ఈ క్రమంలో జేసీ శ్రీధర్, బాపట్ల ఆర్డీఓ గంధం రవీందర్ మాట్లాడుతూ ప్రజాభిప్రాయాన్ని నివేదిక రూపంలో కాలుష్య నియంత్రణ మండలికి, మైనింగ్, ఇతర సంబంధిత శాఖలకు పంపిన అనంతరం వివరాలు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యావరణ శాఖ ఇంజినీర్ జి.నాగిరెడ్డి, తహసీల్దార్ బి.వెంకటరెడ్డి, సర్వేయర్ ఏడుకొండలు, ఆర్ఐ బాషా, రెవెన్యూ సిబ్బంది, రెండు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.


ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్న అధికారులు

విజేత గుంటూరు జిల్లా ఎడ్లజత


ఎడ్ల బలప్రదర్శన పోటీ జరుగుతున్న దృశ్యం

దాచేపల్లి : వీర్ల అంకమ్మతల్లి కొలుపుల తిరునాళ్ల సందర్భంగా తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు శుక్రవారం కూడా ఉత్సాహంగా సాగాయి. నాలుగు పళ్ల విభాగంలో జరిగిన పోటీల్లో గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండబాలవారిపాలెంకు చెందిన గూడవల్లి లక్ష్మీదీక్షలాచౌదరి ఎడ్ల జత 5,977 అడుగుల దూరం బండను లాగి విజేతగా నిలిచింది. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం తోటపాలెంకు చెందిన రామినేని రత్తయ్య చౌదరి, గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం గనికపూడికి చెందిన కల్లూరి ప్రవీణ్‌కుమార్ సంయుక్త ఎడ్ల జత నిర్ణీత సమయంలో 5,949 అడుగుల దూరం బండను లాగి రెండో స్థానంలో, గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండబాలవారిపాలెంకు చెందిన గూడవల్లి లక్ష్మీదీక్షలా చౌదరి ఎడ్లజత 5,298 అడుగుల దూరం బండను లాగి మూడవ స్థానంలో, కృష్ణా జిల్లా గన్నవరం మండలం తెంపల్లికి చెందిన జొన్నలగడ్డ దేవతరావు ఎడ్లజత 5,256 అడుగుల దూరం బండను లాగి నాలుగోస్థానంలో, బాపట్ల జిల్లా మార్టూరుకు చెందిన గౌతుకట్ల వీరాంజనేయ యాదవ్ ఎడ్లజత 5,250 అడుగుల దూరం బండనులాగి ఐదో స్థానంలో, పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం సారంగపల్లి అగ్రహారానికి చెందిన బలగాని ఉదయ్ రేఖా యాదవ్ ఎడ్లజత 5,056 అడుగుల దూరం బండను లాగి ఆరో స్థానంలో నిలిచాయి. పోటీలకు న్యాయ నిర్ణేతగా దుర్గి శ్రీనివాసరావు వ్యవహరించారు. విజేతలకు వరుసగా దాతలు అంబటి నారాయణ, కూరాకుల నాగేశ్వరరావు, పసుపులేటి ఆదినారాయణ, నందేల రామిరెడ్డి, గాదె రామకృష్ణారెడ్డి, సంకురాత్రి బుల్లోడు, తిప్పా బ్రదర్స్, బిళ్లల వెంకటేశ్వర్లు నగదు, షీల్డ్స్ బహూకరించారు. కమిటీ సభ్యులు కొప్పుల గిరి, దిలీప్, ప్రశాంత్ తదితరులు పర్యవేక్షించారు.

జత పళ్ల విభాగంలో పల్నాడు ఎడ్ల సత్తా

మాచవరం: మండలంలోని కొత్తపాలెం గ్రామంలో నీలకంఠేశ్వరస్వామి కల్యాణోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీల్లో మాచవరం గ్రామం కొత్తపాలెం గ్రామానికి చెందిన మన్నంపల్లి వెంకటరత్నం, శావల్యాపురం మండలం మతకమల్లి గ్రామానికి చెందిన ముంద్రు జీవప్రసాదు చెందిన సంయుక్త ఎడ్ల జత 3,750 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. కల్లూరి ప్రవీణ్‌కుమార్ (గనికపూడి, ప్రత్తిపాడు మండలం), జంగా రామలింగయ్య యాదవ్ (దాచేపల్లి) కంబైన్డ్ ఎడ్లజత 3,099.4 అడుగులు, మావనబోయిన పోతురాజు యాదవ్ (ఇక్కుర్తి, నర్సరావుపేట మండలం) ఎడ్లు 2852.4 అడుగులు, లింగా అంజయ్య (గురజాల) ఎడ్లు 2827.5 అడుగులు, యామర్తి వెంకటేశ్వర్లు (శ్రీరుక్మిణీపురం, మాచవరం మండలం) ఎడ్లు 2288 అడుగులు, ముద్దన సుహాస్ (జగ్గాపురం, యడ్లపాడు మండలం), సంపటం తిరుపతయ్య నాయుడు (ఉయ్యందన,క్రోసూరు మండలం) కంబైన్డ్ ఎడ్లజత 2163.10 అడుగులు ఆరుద్ర మానస గంగా (మాచవరం) ఎడ్లు 2000 అడుగుల దూరాన్ని లాగి ఆ తర్వాతి వరుస స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నాయి.

పాలపళ్ల విభాగంలో..

మోపర్తి ఆర్యాన్ చౌదరి (నార్నెపాడు, ముప్పాళ్ల మండలం) ఎడ్లు 3,500 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. కన్నెదార రామ్‌తేజా చౌదరి (పెదకూరపాడు) ఎడ్లు 3,250 అడుగులు, వెలిదిండి బాబు (ఇనిమెట్ల, రాజుపాలెం మండలం) 3,250 అడుగులు, మోదుగుల రామిరెడ్డి (పెద పరిమి, తుళ్లూరు మండలం) ఎడ్లు 3,202 అడుగుల దూరాన్ని లాగి తర్వాతి వరుస స్థానాల్లో నిలిచాయి.

పోలీసుల అదుపులో దొంగల ముఠా?

మార్టూరు: ప్రయాణికులను దారి కాచి కత్తులతో బెదిరించి చోరీలకు పాల్పడుతున్న ఓ ముఠాను శుక్రవారం మార్టూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఇటీవల స్థానిక జాతీయ రహదారిపై రాత్రి పూట సర్వీసు రోడ్డులో ద్విచక్రవాహనాలపై వెళ్తున్న ప్రయాణికులను కొందరు వ్యక్తులు కత్తులు చూపి బెదిరించి దోపిడీలకు పాల్పడుతున్నారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు అందినా పోలీసులు వాటిని గోప్యంగా ఉంచినట్లు సమాచారం. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి స్థానిక పోలీసు అధికారులు దీనికి సంబంధించిన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని వారి నుంచి ఓ ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

సారా బట్టీలపై దాడులు

బాపట్లటౌన్: మండలంలోని స్టువర్టుపురం పెద్దగ్యాంగ్‌లో శుక్రవారం వెదుళ్ళపల్లి పోలీసులు దాడులు చేశారు. చుక్కా శ్రీహర్ష సారా తయారు చేస్తుండగా అతనిని అదుపులోకి తీసుకుని 50 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు వెదుళ్ళపల్లి ఎస్ఐ నాగశ్రీను తెలిపారు. దాడులు నిర్వహించిన వారిలో ఏఎస్ఐ నరసింహమూర్తి, హెడ్ కానిస్టేబుల్ గోపయ్య పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

చీరాల రూరల్: రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం చినగంజాం-వేటపాలెం రైల్వే స్టేషన్ల మధ్య కడవకుదురు గ్రామ సమీపంలో జరిగింది. జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య తెలిపిన వివరాల మేరకు సుమారు 30-35 సంవత్సరాలు వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు అందిన సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని ఎస్సై చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు. అలానే మృతుడి ఎత్తు 5.7, నలుపు ఛాయ కలిగి ఉన్నాడని, నీలం రంగు టీషర్టు, కాషాయం రంగు టవల్, ఎరుపు రంగు బూట్లు ఉన్నాయని, ఎడమవైపు వీపుమీద పుట్టుమచ్చ ఉందన్నారు. మృతదేహాన్ని గుర్తించగలిగిన వారెవరైనా ఉంటే ప్రభుత్వాసుపత్రి వెళ్లవచ్చనని చెప్పారు. పూర్తి సమాచారం కోసం జీఆర్పీ ఎస్సై 94406 27646 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో...

చినగంజాం: ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం వేకువ జామున జాతీయ రహదారిపై జరిగింది. ఎస్సై కె.సురేష్ కథనం ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున కడవకుదురు గ్రామ పరిధిలోని జాతీయ రహదారిపై టీవీఎస్ మోపెడ్‌పై వెళుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఈప్రమాదంలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి పూర్తి సమాచారం తెలియరాలేదు. గ్రామ వీఆర్వో నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఘటనాస్థలంలో ఏపీ 39 బీఏ 6117 నంబరు గల ఆకుపచ్చ రంగు టీవీఎస్ మోపెడ్ పడి ఉంది. మరణించిన వ్యక్తి నీలం రంగు టీ షర్ట్, జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్ నంబర్ 91211 02149కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

ఆరోగ్యసేవలన్నీ ఆన్‌లైన్‌లో

వైద్య, ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రామ్ అధికారి ప్రేమపావని

బల్లికురవ: బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు సంబంధించి ఆరోగ్య సేవలన్నీ ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ బాపట్ల జిల్లా ప్రోగ్రామ్ అధికారి ప్రేమపావని పేర్కొన్నారు. శుక్రవారం గుంటుపల్లి పీహెచ్‌సీలో బల్లికురవ, సంతమాగులూరు మండలాల వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మాతాశిశు సంరక్షణే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. వ్యాక్సినేషన్ నూరుశాతం పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ ఎస్‌వో మార్గరేట్, డీసీఎం సుజాత, హెల్త్ ఎడ్యుకేటర్‌లు అంజమ్మ, లక్ష్మి, వైద్యాధికారులు శాంతి, ఉమాదేవి, ధనరాజ్, భారతి, రమీజ్ అహమ్మద్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పీవో ప్రేమపావని

'జగనన్నకు చెబుదాం'ను జయప్రదం చేద్దాం

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం మే తొమ్మిదిన ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని జిల్లాలో జయప్రదం చేయాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన సమీక్షకు కలెక్టరేట్‌లోని వీసీ హాలు నుంచి ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, జేసీ ఎ.శ్యామ్‌ప్రసాద్‌తో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. అనంతరం హాజరైన జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంపై సీఎంఓ స్థాయి నుంచి పర్యవేక్షణ ఉంటుందని వివరించారు. ప్రత్యేకంగా నియమించిన సీనియర్ లెవెల్ ఐఏఎస్ అధికారులు నెలకు రెండుసార్లు జిల్లాల్లో పర్యటించి అమలు తీరును పరిశీలిస్తారన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పేదలందరికీ ఇళ్లు పథకంలో ఇంటి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాలను వేగంగా పూర్తిచేయాలన్నారు.


సీఎం జగన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్

పారిశుద్ధ్య కార్మికుల జీతాలు పెంచింది సీఎం జగనే

రెడ్‌క్రాస్ కిట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట: రాష్ట్ర వ్యాప్తంగా పారిశుద్ధ్య కార్మికులకు రూ.12వేల నుంచి రూ.21 వేలకు జీతాలు పెంచినది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గుర్తు చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా 325 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఒక్కొక్కరికి రూ.500 విలువచేసే హైజనిక్ కిట్లను ఉచితంగా పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రోజూ కార్మికులు కష్టపడితేనే పట్టణం పరిశుభ్రంగా ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని సీఎం జగన్ జీతాలు పెంచారన్నారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి పారిశుద్ధ్య కార్మికులు అందించిన సేవలు నిరుపమానమని కొనియాడారు. ఆ సమయంలో వారికి వివిధ సేవాసంస్థలు, మున్సిపల్ కార్యాలయం ద్వారా నిత్యావసరాలు అందజేసి ఆదుకున్నామన్నారు. జిల్లా ఏర్పడిన తర్వాత రూ.4.5కోట్లతో కాంపోనెంట్ బ్లడ్‌సెంటర్‌ను రెడ్‌క్రాస్ ద్వారా ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్లేట్‌లెట్స్ కావాల్సిన వారికి ఈ సెంటర్ ద్వారా లభ్యమవుతాయని వివరించారు. రెడ్‌క్రాస్ సంస్థలో మెంబర్లుగా చేరితే గుర్తింపు కార్డు ఇస్తారని, ఎప్పుడైనా రక్తం కావాల్సివస్తే ఆ మెంబర్‌కు మొదట ఇచ్చిన తర్వాతనే మిగతా వారికి అందజేస్తారన్నారు. అగ్ని ప్రమాదాలు లాంటి విపత్కర దుర్ఘటనలు ఎదురైన సమయంలో రెడ్‌క్రాస్ సంస్థ బాధితులకు అండగా ఉంటుందని వివరించారు. రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు కంజుల జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బ్లడ్‌సెంటర్‌కు దాతల సహకారం ఎంతో అవసరం ఉందని, విరాళాలు ఇచ్చిన వారికి పన్ను మినహాయింపు లభిస్తుందని వివరించారు. మున్సిపల్ ఉద్యోగులు అందరూ రెడ్‌క్రాసు మెంబర్లుగా చేరేందుకు మున్సిపల్ కమిషనర్ చొరవ తీసుకోవాలని కోరారు. రెడ్‌క్రాస్ సంస్థకు ప్రభుత్వం కేటాయించిన స్థలంలో భవన నిర్మాణం చేపడతామని వెల్లడించారు. కార్యదర్శి కేవీఎస్ఎన్ శ్రీనివాస గుప్తా మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి సూచనల మేరకే కిట్లను అందజేస్తున్నామని పేర్కొన్నారు. పల్నాడు జిల్లా అభివృద్ధి అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్ మాట్లాడుతూ కిట్ల పంపిణీ ద్వారా ప్రతి ఒక్కరికీ సహాయం చేయాలనే రెడ్‌క్రాస్ దృక్పథం అభినందనీయమన్నారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మాజేటి సాంబశివరావు, రెడ్‌క్రాస్ కోశాధికారి రాము, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచారకార్యదర్శి జి.ఉత్తమరెడ్డి, పూనూరి కోటిరెడ్డి, హాలీవుడ్ రఘు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.


పారిశుద్ధ్య కార్మికులకు రెడ్‌క్రాస్ కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు